## విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189



# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA






Telangana | సంపుటి: 1, సంచిక: 168 | volume: 1, Issue:168 | గురువారం 15 జనవరి 2026 | పేజీలు : 8 | వెల : 3.00


## భోగి పండుగ సందర్భంగా తెలుగు ప్రజలకు
## సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

- తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా భోగి...
- ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలి...
- ఆనందంగా సంక్రాంతి--కనుమ పండుగలు జరుపుకోవాలి...

**హైదరాబాద్, జనవరి 14 :** భోగి పండుగ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి అనేది తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ అని పేర్కొంటూ, ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భోగి పండుగ కొత్త ఆరంభాలకు నాంది పలికే రోజు అని ముఖ్యమంత్రి తెలిపారు. పాత బాధలు, కష్టాలను విడిచిపెట్టి కొత్త ఆశలు, కొత్త కాంతులతో ముందుకు సాగాల్సిన సమయం ఇదని అన్నారు. ఈ పండుగ ద్వారా సానుకూల ఆలోచనలు, సామాజిక ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. సంక్రాంతి, కనుమ పండుగలు రైతాంగ జీవనంతో విడదీయరాని బంధం కలిగి ఉన్నాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పంట చేతికొచ్చిన ఆనందం ఈ పండుగల్లో ప్రతిబింబిస్తుందని, గ్రామీణ సంస్కృతి, తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు జరగాలని సూచించారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా పండుగలను జరుపుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ సంక్రాంతి కాలం రాష్ట్ర ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షిస్తూ తన సందేశాన్ని వెల్లడించారు.

## డిల్లీలో ఘనంగా సంక్రాంతి పొంగల్ వేడుకలు



ప్రధాని నరేంద్ర మోదీ సంక్రాంతి, పొంగల్ పండుగలను దేశ రాజధాని డిల్లీలో ఘనంగా జరుపుకున్నారు. కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో నిర్వహించిన పొంగల్ వేడుకల్లో ప్రధాని పాల్గొని దేశ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోవులకు పూజలు చేసి, సంప్రదాయబద్ధంగా పొంగలి వండారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్ మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. సంక్రాంతి వేడుకల అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత ఏడాది తమిళనాడులో జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో తాను పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన గంగైకొండ చోళపురం ఆలయాన్ని సందర్శించిన అనుభవం, పంబన్ వంతెన ప్రారంభోత్సవ సందర్భాల్లో తమిళుల చరిత్ర, సంస్కృతి గొప్పతనాన్ని దగ్గరగా తెలుసుకున్నానని తెలిపారు. కొన్ని నెలల క్రితం తమిళనాడులో సహజ వ్యవసాయంపై నిర్వహించిన సమావేశానికి తాను హాజరైనట్లు ప్రధాని చెప్పారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకురావడానికి వారు చేస్తున్న కృషి తనను ఎంతో ప్రేరేపించిందని అన్నారు. రైతులు దేశ నిర్మాణంలో బలమైన భాగస్వాములని పేర్కొంటూ, వారిని మరింత శక్తిమంతంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిబద్ధతతో పనిచేస్తోందని ప్రధాని స్పష్టం చేశారు.

## ఆధార్ అప్‌డేట్ పేరిట మోసాలు




ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలనే పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై తెలంగాణ పోలీస్ ప్రజలను అప్రమత్తం చేసింది. ఇటీవల బ్యాంక్ ఖాతాలు, వ్యక్తిగత సమాచారం లక్ష్యంగా నకిలీ సందేశాలు పంపిస్తూ మోసగాళ్లు ప్రజలను మభ్యపెడుతున్నారని పోలీసులు హెచ్చరించారు. ఆధార్ అప్‌డేట్ చేయాల్సిందిగా తెలియజేస్తూ వచ్చే లింకులు, సందేశాలు ఎక్కువగా నకిలీవేనని స్పష్టం చేశారు. అలాంటి లింకులపై క్లిక్ చేయడం ద్వారా మొబైల్ ఫోన్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని, బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు కాజేసే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఆధార్ అప్‌డేట్ కోసం పంపినట్లు చెప్పే లింకులు, మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని సూచించారు. ఆధార్ అప్‌డేట్‌కు సంబంధించిన పనులు కేవలం అధికారిక కేంద్రాలు లేదా ప్రభుత్వ ధృవీకృత వెబ్‌సైట్ల ద్వారానే జరుగుతాయని పోలీసులు తెలిపారు. వ్యక్తిగత వివరాలు, ఆధార్ సంఖ్య, బ్యాంక్ వివరాలు, ఓటీపీ వంటి సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలపై విశ్వాసం పెట్టకూడదని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అనుమానాస్పద సందేశాలు లేదా కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలంగాణ పోలీసులు కోరారు. సైబర్ మోసాలపై అవగాహన పెంచుకొని, అప్రమత్తంగా ఉండటమే ఉత్తమ రక్షణ అని పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు జనసేన సిద్ధం

- అన్ని మున్సిపాలిటీల్లో పోటీ చేస్తాం...
- యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది...
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ఆర్‌కే సాగర్...

**కరీంనగర్, జనవరి 14 :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి జనసేన పార్టీ పూర్తిగా సిద్ధంగా ఉందని పార్టీ ప్రచార కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ఆర్‌కే సాగర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈసారి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో జనసేన పార్టీ అభ్యర్థులను బరిలోకి దించేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. రాజకీయాల్లో యువరక్తం ఎక్కువగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆర్‌కే సాగర్ పేర్కొన్నారు. అప్పుడే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను నేరుగా అర్థం చేసుకునే శక్తి యువతకు ఉంటుందని, అలాంటి యువ నాయకత్వాన్ని జనసేన పార్టీ ప్రోత్సహిస్తోందని చెప్పారు. నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేసే దిశగా అనేక మంది కొత్త వ్యక్తులను జనసేన పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. కొత్తగా చేరిన వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికినట్లు పేర్కొన్నారు. స్థానిక స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాలకు చెందిన నాయకులు, జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మహిళలపై వ్యక్తిత్వ దాడులు అంగీకారయోగ్యం కాదు

- **విమర్శ పేరుతో క్రూరత్వం సహించబోం...**
- **మహిళల గౌరవమే సమాజ భవిష్యత్‌కు పునాది...**
- **సీపీ సజ్జనార్...**



**హైదరాబాద్, జనవరి 14:** ప్రజాజీవితంలో విమర్శలు సహజమే అయినా, అదే పేరుతో మహిళలపై వ్యక్తిత్వ దాడులు చేయడం తీవ్రమైన తప్పిదమని తెలంగాణ పోలీస్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. మహిళ ప్రభుత్వ అధికారి అయినా, ప్రైవేట్ రంగంలో పని చేసే వృత్తిపరమైన మహిళ అయినా, గృహిణి అయినా వారిపై మాటల ద్వారా, మీడియా కథనాల ద్వారా లేదా సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేయడం విమర్శ కాదని, అది నిస్సందేహంగా క్రూరత్వమేనని ఆయన పేర్కొన్నారు. నేటి సమాజంలో మహిళలు పరిపాలన, పోలీసు వ్యవస్థ, పాలన, శాస్త్ర సాంకేతిక రంగం, ప్రజాజీవితం, మీడియా వంటి అనేక రంగాల్లో ముందుండి నాయకత్వం వహిస్తున్నారని సజ్జనార్ తెలిపారు. అంతేకాదు, ఇంటి బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహిస్తూ, ఉద్యోగం, కుటుంబం, సమాజం మధ్య సమతుల్యత సాధిస్తున్నారని అన్నారు. అలాంటి మహిళల వ్యక్తిత్వంపై దాడి చేయడం అంటే మనం గర్వపడే సామాజిక పురోగతినే దెబ్బతీయడమేనని అభిప్రాయపడ్డారు. మన ప్రాచీన సంస్కృతి మహిళల గౌరవానికి ఉన్న విలువను స్పష్టంగా చెబుతుందని ఆయన గుర్తు చేశారు. “యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః” అనే శాస్త్రవాక్యాన్ని ఉటంకిస్తూ, మహిళలను గౌరవించే చోటే దైవత్వం నివసిస్తుందని వివరించారు. మహిళల పట్ల గౌరవభావం లేకపోతే సమాజం ముందుకు సాగలేదని అన్నారు. ఇటీవల కొంతమంది మహిళా అధికారులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని సజ్జనార్ తెలిపారు. మహిళలను గౌరవించలేని సమాజం తన భవిష్యత్తునే బలహీనపరుచుకుంటుందని హెచ్చరించారు. మహిళలపై అవమానం, పక్షపాతం, వ్యక్తిత్వ దాడులను సమాజం ఏ మాత్రం సహించదని స్పష్టం చేస్తూ, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదేనని ఆయన వ్యాఖ్యానించారు.


## భారత్ జోడో న్యాయ్ యాత్రకు రెండేళ్లు



న్యూఢిల్లీ, జనవరి 14 : రెండేళ్ల క్రితం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మణిపూర్ నుంచి ముంబయి వరకు ప్రారంభించిన భారత్ జోడో న్యాయ్ యాత్ర దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచిందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. రెండు నెలల పాటు సాగిన ఈ యాత్ర సుమారు 6,600 కిలోమీటర్ల మేర ప్రయాణించి 15 రాష్ట్రాలను కవర్ చేస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాల కోసం గళం విప్పింది. యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలను కలుసుకుంటూ అసమానతలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రజాస్వామ్య సంస్థల బలహీనత వంటి అంశాలపై చర్చను ముందుకు తెచ్చినట్లు తెలిపారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ యాత్ర ప్రధాన లక్ష్యంగా కొనసాగిందని పేర్కొన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రభావంతోనే భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ అంశాలు లోక్‌సభ 2024 ఎన్నికల ప్రచారంలో కేంద్రబిందువుగా మారాయని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఎన్నికల సమయంలోనే కాకుండా నేటి ప్రజా చర్చల్లో కూడా ఈ అంశాలు ప్రధానంగా నిలవడం యాత్ర సాధించిన విజయంగా వారు పేర్కొన్నారు.

## పతంగిని ఎగరేసిన హైడ్రా కమిషనర్...

- కూకట్పల్లిలో ఘనంగా కైట్ ఫెస్టివల్....
- చెరువుల అభివృద్ధి అంటే ఇలా ఉండాలని నిరూపణ...



**హైదరాబాద్, జనవరి 14 :** కూకట్పల్లి నల్లచెరువులో బుధవారం పండగ వాతావరణం నెలకొంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పతంగిని ఎగరవేయడంతో అక్కడి వాతావరణం ఉత్సాహంతో నిండింది. బాల్యం, యువకాళం జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పిల్లలు, యువకులతో కలిసి ఆయన పతంగిని ఎగరవేశారు. స్థానికుల ఆహ్వానం మేరకు నల్లచెరువు చెంత నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 సెప్టెంబరులో నల్లచెరువు విస్తరణ పనులు ప్రారంభించినప్పుడు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయని గుర్తు చేశారు. నేడు అదే ప్రదేశంలో పండగ వాతావరణం నెలకొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అక్రమ కబ్జాలతో 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్లచెరువును 30 ఎకరాలకు విస్తరించామని తెలిపారు. 10 అడుగుల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువును మురికి నుంచి విముక్తం చేశామని చెప్పారు. చెరువు లోతు పెంచడం ద్వారా పరిసర ప్రాంతాల్లో వరదలకు నియంత్రణ సాధిస్తున్నామని పేర్కొన్నారు. కేవలం పై మెరుగులు దిద్దడం కాకుండా, చెరువుల అభివృద్ధి అంటే ఇలాగే ఉండాలని నిరూపించామని అన్నారు. ఇప్పుడు చెరువును చూస్తే ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, మరిన్ని అందాలు సమకూరుస్తున్నామని తెలిపారు. ఐదు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి వాకింగ్ చేస్తున్నామని పలువురు చెప్పడం చాలా ఆనందంగా ఉందన్నారు. నల్లచెరువు పరిధిలో షటిల్ కోర్టు, కమ్యూనిటీ హాల్, యోగ కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్ వంటి క్రీడా సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఇవన్నీ ప్రజలు ఉచితంగా వినియోగించుకునేలా ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తామని కమిషనర్ వెల్లడించారు. హైడ్రా మొదటి విడతలో ఆరు చెరువుల అభివృద్ధి పూర్తయ్యిందని, ఇప్పటికే బతుకమ్మకుంటను ప్రారంభించామని చెప్పారు. మరో మూడు చెరువులను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. వీటికి తోడు ప్రభుత్వం నిర్దేశించిన మరో 14 చెరువుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. నగరంలో వంద చెరువులు అభివృద్ధి అయితే వరదల సమస్యను చాలా వరకు నియంత్రించవచ్చని అభిప్రాయపడ్డారు. మురికి కూపాలుగా ఉన్న చెరువులను ఆహ్లాదకరంగా మార్చడం ద్వారా భూగర్భ జలాలు పెరగడమే కాకుండా, మంచి నీరు అందుబాటులోకి వస్తుందని అన్నారు. చెరువులు వేడుకలకు వేదికలవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దుర్గంధభరితమైన వాతావరణాన్ని తొలగించి ఆహ్లాదాన్ని నింపిన హైడ్రాకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు, స్థానికులకు కమిషనర్ మిఠాయిలు పంచారు.

## మేముసైతం యూత్ ఆధ్వర్యంలో రంగవల్లుల ఫోటీలు



**చందుర్తి, జనవరి 14, మన వార్త.** చందుర్తి మండలం కిష్టంపేట గ్రామం లో మేము సైతం యూత్ ఆధ్వర్యంలో బుధవారం రంగవల్లుల (ముగ్గుల)ఫోటీలు నిర్వహించారు.మొత్తం 40 మంది గ్రామ మహిళలు, యువతులు, ఈ ఫోటీలో పాల్గొన్నారు.ఈ పోటీలో మొదటి బహుమతి పండుగ ఆకాంక్ష 3000,రెండవ బహుమతి అనుపాల సుమలత 1500,మూడవ బహుమతి అంబిరీ మౌనిక 500 గెలుచుకున్నారు.ఈ సందర్భంగా మేముసైతం యూత్ సభ్యులు మాట్లాడుతూ,సంక్రాతి పండుగ విశిష్టతను చాటి చెప్పే విధంగా రంగవల్లుల ఫోటీలు నిర్వహించామని తెలిపారు.గెలుపొందిన వారికి మేము సైతం యూత్ సభ్యులు అభినందనలు తెలిపి బహుమతులు అందచేశారు.సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.పుష్య మాసం చలికాలంలో ముగ్గులు వేయడం మహిళల వేళ్లకు ఓ మంచి వ్యాయామంగా ఉంటుందని వివరించారు.సనాతన సంప్రదాయాల్లో ఎన్నో శాస్త్రీయమైన అంశాలు దాగి ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమం లో మేము సైతం యూత్ అధ్యక్షులు ఉగిలే వినోద్, ఉపాధ్యక్షులు ఉగిలే నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

## కాశీ విశ్వనాథుడిని దర్శించుకున్న కిష్టంపేట సర్పంచ్



**చందుర్తి, జనవరి 14, మన వార్త.** చందుర్తి మండలం కిష్టంపేట సర్పంచ్ మొకానపెల్లి దేవరాజు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లోని వారణాసి కాశీ విశ్వనాథుడిని బుధవారం దర్శించుకున్నారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నందుకు చాలా సంతోషం గా ఉందని తెలిపారు.ఉత్తరప్రదేశ్లోని వారణాసి నగరంలో పవిత్ర గంగానదికి పశ్చిమ ఒడ్డున ఉన్న ప్రసిద్ధ శైవక్షేత్రమే కాశీ విశ్వనాథ దేవాలయం. ఈ ఆలయం భారతదేశంలోని అత్యంత పురాతన, పవిత్రమైన జ్యోతిర్లింగాలలో ఒకటిగా భావించబడుతుంది.కాశీ విశ్వనాథ ఆలయానికి సమీపంలో గంగానది తీరం వద్ద ఉన్న మణికర్ణిక ఘాట్ శక్తి పీఠంగా పూజించబడుతుంది. స్కంద పురాణంలోని కాశీ ఖండం సహా అనేక పురాణ గ్రంథల్లో ఈ దేవాలయం మహిమ విస్తృతంగా వివరించబడిందని చెప్పుకొచ్చారు.

## కరీంనగర్ పాలడైరీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

**–ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి బహుమతుల ప్రధానం....**



**బెజ్జంకి,జనవరి 14(మన వార్త ప్రతినిధి )**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామానికి చెందిన మహిళలు కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలోనీ పాల డైరీ లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ యొక్క ముగ్గుల పోటీలలో పాల్గొన్న దూశెట్టి సంగీత,చిన్ని శ్రీనిది,చెప్యాల రమ్య కీ గుగ్గిళ్ల గ్రామ కరీంనగర్ డైరీ అధ్యక్షులు తడిసిన రాజిరెడ్డి, డైరీ డైరెక్టర్లతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తడిసిన రాజిరెడ్డి మాట్లాడుతూ గుగ్గిళ్ల గ్రామం కరీంనగర్ డైరీ నుండి కరీంనగర్ జిల్లాలో జరిగే ముగ్గుల పోటీల్లో పాల్గొన్నా సందర్భంగా బహుమతి ప్రధానం చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చిట్టి గంగయ్య, దూశెట్టి లింగరెడ్డి, కొంకటి రాజయ్య, కల్లూరి రాజయ్య, చెప్యాల రాజయ్య,విస్వోజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న శంకరంపేట లో ఘనంగా ముగ్గుల పోటీలు....



**–బహుమతులు అందజేసిన సర్పంచ్ చంద్రశేఖర్...**

**చిన్న శంకరం పేట జనవరి 14 ( మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని స్థానిక సోమేశ్వర దేవాలయం వద్ద గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతిగా అందజేశారు పాల్గొన్న మహిళలందరికి కూడా సర్పంచ్ చంద్రశేఖర్ ఉప సర్పంచ్ భాను ప్రసాద్ తో పాటు పాలకవర్గ సభ్యులు, సర్పంచ్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా చీరలను అందజేశారు, ముగ్గులలో మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని, బాలికలను సంరక్షించండి బాలికలను చదివించండి, పండగ యొక్క సంస్కృతి సాంప్రదాయాలు అర్థమయ్యే విధంగా మహిళలు ముగ్గులు వేశారు, ఈ పోటీలలో మొదటి బహుమతి మేడిమాలతి, ద్వితీయ బహుమతి ఎల్లబోయిన జ్యోతి, తృతీయ బహుమతి సుంకరి సంతోష, నాల్గవ బహుమతి కుమ్మరి పూజ, 5వ బహుమతి సుంకరి ఆద్య, ఆరవ బహుమతి బొమ్మరబోయిన మల్లేష్, లు బహుమతులు అందుకున్నారు, ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ బిజెపి మండల అధ్యక్షులు వార్డు సభ్యులు రాజు తో పాటు మహిళలు మాట్లాడుతూ ఒక పండుగ వాతావరణం కల్పించే విధంగా మహిళలందరినీ ఒకే చోట చేర్చి ముగ్గులు వేయించడం జరిగిందని ప్రతి ఒక్కరు కూడా సుఖసంతోషాలతో ఉంటూ కలిసిమెలిసి ఉండే విధంగా ముగ్గుల పోటీ నిర్వహించడం జరిగినట్లు తెలిపారు, ప్రతి సంవత్సరం మహిళలకు ఇలాగే పోటీలు నిర్వహించి చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరినీ ఒకే చేయుటకు చేర్చి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ ఉపసర్పంచ్ భానుప్రసాద్, బిజెపి మండల అధ్యక్షులు రాజు, అంగన్వాడి టీచర్లు మాలతి, నాగరాణి,వివో ఏలు స్వప్న, చైతన్య, వివో ఓ బి వనజ, నాయకులు ఎల్లం, గోపాల్, శ్రీనివాస్, జాకీర్, శంకర్, నిద్రబోయిన స్వామి, ఆకుల వెంకటి, బలరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ కి ఆహ్వాన పత్రికను అందజేసిన

### సమ్మక్క- సారాలమ్మ జాతర కమిటీ సభ్యులు



**కోహెడ జనవరి 14 ( మన వార్త ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని పురాతనమైన అమ్మవారి జాతరైన పరివేద గ్రామములో జరిగే సమ్మక్క- సారాలమ్మ జాతరకు కేంద్రమంత్రి బండి సంజయ్ ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులవెంట బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ ఖమ్మం వేంకటేశం, బిజెపి మండల అధ్యక్షుడు జాలిగం రమేష్,పరివేద బిజెపి గ్రామశాఖ అధ్యక్షుడు పెంద్యాల సంపత్ రెడ్డి,పరివేద సర్పంచ్ జాతర కమిటీ సభ్యులు మీస కొమురయ్య, మాజీ సర్పంచ్ చాడ సుదర్శన్ రెడ్డి, చాడ రాజిరెడ్డి, గుంట మల్లయ్య, కూరేళ్ల వేణు, గవ్వ వీరా రెడ్డి,పొన్నం శ్రీనివాస్ సిసిపల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న రంగవల్లులు




**చందుర్తి , జనవరి 14 , మన వార్త.** సంక్రాంతి అంటేనే రంగవల్లుల పండగ . ప్రతి సంవత్సరం ఆంగ్ల నూతన సంవత్సరం మొదలు కాగానే సంక్రాంతి, కనుమ, భోగి, పండగలుకు స్వాగతం పలుకుతూ రంగు రంగుల ముగ్గుల తో ప్రతి ఊరు కళకళ లాడుతుంది.మహిళలు చుక్కలను కలుపుతూ, చక్కలు పెట్టకుండా,డ్రాయింగ్ లా, గీతలు గీయడం ఇలా పలు రకాల ముగ్గులు వేస్తుంటారు.ముగ్గులు పెట్టాలంటే క్రియశీలకమైన సజనాత్మకత కలిగి ఉండాలి. రంగోలిని బియ్యం పిండితో వేస్తారు. ఆ ముగ్గులు మరింత కలర్ ఫుల్ గా బ్రైట్ గా కనబడాలంటే వాటికి వివిధ రకాల రంగులు కలుపుకొని షేడ్ చేస్తారు.ఒక్కొక్కరు ఒక్కో రకంగా వేస్తుంటారు...రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలం కిష్టంపేట గ్రామం లో మేముసైతం యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల ఫోటీలు జరిగాయి.ముగ్గురు యువతులు వేసిన రంగవల్లులు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి.గ్రామానికి చెందిన పండగ ఆకాంక్ష ఓ మహిళా ముగ్గు వేస్తున్న ముగ్గును క్షణాల్లో వేసి మొదటి బహుమతి గెలుచుకోగా, అనుపాల సుమలత శివ పార్వతుల ముగ్గు వేసి రెండవ బహుమతి పొందింది, అంబిరీ మౌనిక శ్రీ తిరుమల తిరుపతి దేవుడి రూపం లో ఉన్న ముగ్గు వేసి మూడవ బహుమతి కైవసం చేసుకుంది.ఈ ముగ్గురు యువతులను గ్రామ సర్పంచ్ మొకానపెల్లి దేవరాజు, ఉపసర్పంచ్ అంబిరీ మంజుల మహేష్, వార్డు మెంబర్లు అభినందించారు.

## వినూత్న రీతిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం




**వేములవాడ జనవరి 14 (మన వార్త)** జాతీయ రోడ్డు భద్రత కార్యక్రమం 'Arrive Alive' అనే థీమ్తో రోడ్డు భద్రత మీద ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్రాజం తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై వెంకట్రాజం మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకొని ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగిసి, ప్రతి వ్యక్తి క్షేమంగా ఇంటికి చేరాలనే సందేశాన్ని ఈ థీమ్ స్పష్టంగా తెలియజేస్తుంది అని తెలిపారు. వాహనదారులు ముఖ్యం గా అతివేగంగా వాహనాలు నడపకూడదు అని మద్యం సేవించి వాహనం నడపడం వల్ల మీకు మరియు ఎదుటి వారికి ప్రమాదం అని, మోటార్ సైకిల్ లు నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించకపోవటం, కార్ లు నడిపే వారు సీట్బెల్ట్ ధరించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ట్రాఫిక్ నియమాలు విధిగా అందరూ పాటించాలి అని సూచించారు.

## తుర్కపల్లి బొల్లారం 190 డివిజన్ గణేష్నగర్ ఫేజ్ 2లో

### ఓపెన్ నాల కారణంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, జనవరి 14 మన వార్త :** అల్వాల్ సర్కిల్ పరిధిలోని 190 డివిజన్ తుర్కపల్లి బొల్లారం గణేష్నగర్ ఫేజ్--2 ప్రాంతంలో ఓపెన్ నాల కారణంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ మధ్యలోనే ఉన్న ఈ ఓపెన్ నాలలో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల బెడద అధికమైందని, దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాలలో నిలిచిపోయిన మురుగునీటి వల్ల దుర్వాసన వ్యాపించడంతో రోజువారీ జీవనం కూడా ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు తెలిపారు. ముఖ్యంగా వర్షాలు పడుతున్న సమయంలో మురుగునీరు పొంగి బయటకు రావడంతో పరిసర ప్రాంతాలు మరింత దుర్గంధంగా మారుతున్నాయని వాపోయారు. ఈ పరిస్థితుల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఇక ఓపెన్ నాల పూర్తిగా కప్పివేయకపోవడంతో చిన్నపిల్లలు నాలలో పడే ప్రమాదం కూడా ఉందని కాలనీవాసులు తెలిపారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డు దాటేటప్పుడు భయంతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. గతంలో కూడా ఇలాంటి ప్రమాదాలు జరగబోయే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు.ఈ సమస్యపై గతంలోనే హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ మరియు జీహెచ్ఎంసీ సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చేపట్టలేదని కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు వచ్చి పరిశీలిస్తామని, త్వరలో పనులు చేపడతామని చెప్పి వెళ్లడం తప్ప, క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ఈ నేపథ్యంలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహేష్ చెలిమెల గణేష్నగర్ ఫేజ్--2 ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మరియు స్థానికులుతో మాట్లాడి సమస్యను వివరంగా తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న ఓపెన్ నాల సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.మహేష్ చెలిమెల మాట్లాడుతూ, గణేష్నగర్ ఫేజ్--2లో ఓపెన్ నాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ సమస్యను సంబంధిత హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ మరియు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఓపెన్ నాలను పూర్తిగా కప్పివేయడంతో పాటు, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు విజయ్, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, మాట్లాడుతూ. సమస్య త్వరగా పరిష్కారమైతేనే కాలనీలో నివసించే ప్రజలు ప్రశాంతంగా జీవించగలరని, అధికారులు ఇకనైనా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు మరోసారి కోరారు.

## బెజ్జంకిలో ఘనంగా గోదాదేవి రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం



**బెజ్జంకి, జనవరి 14( మన వార్త ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా బెజ్జంకి గ్రామ ఊరి (పాత గుడి) లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గోదాదేవి, రంగనాయకుల కళ్యాణ మహోత్సవం బుధవారం అర్చకులు శేష మధుసూదనా చార్యులు కళ్యాణం మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ యొక్క కళ్యాణ మహోత్సవానికి హాజరైన వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ జెల్లా ప్రభాకర్, బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ (పెద్దన్న) ఆలయ కమిటీ సభ్యులు బెజ్జంకి మండల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## దాతల సహకారం తో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తా...



**–సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్....**

**చిన్న శంకరంపేట జనవరి 14 ( మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండలం చందంపేట గ్రామంలో వీరభద్రుని ఆలయానికి, పల్లె దావఖాన నుండి పల్లె ప్రకృతి వనం వరకు అభివృద్ధిలో భాగంగా తన వంతు సహకారం కొండారెడ్డి, ఐమాక్స్ లైట్లు అందజేశారు, అలాగే వీరభద్రుని ఆలయం ధర్మకర్త గాండ్ల నాగభూషణం గుడి పరిసర ప్రాంతాలలో ఐమాక్స్ లైట్లు, తన వంతు సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దాతల సహకారంతో దేవాలయాన్ని అన్ని రకాల అభివృద్ధి పరుస్తానని, ఆలయ అభివృద్ధికి గ్రామ ప్రజలు తోడ్పాటు అందించాలని పాలకవర్గం సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ ఉప సర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులు భూపాల్, రామకృష్ణ స్వామి, గౌతమి, లావణ్య, మౌనిక, నర్సింలు, నరేష్, పంచాయతీ సిబ్బంది కారోబార్ పెంట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పాలకవర్గం పనితీరు అభినందనీయం




**చందుర్తి, జనవరి 13, మన వార్త.** చందుర్తి మండలం కొత్తపేట గ్రామపంచాయతీ పాలకవర్గం పనితీరు అభినందనీయమని రాజన్న సిరిసిల్ల బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అన్నారు.సంక్రాంతి సందర్భంగా కొత్తపేట సర్పంచ్ ఊరడి నరేష్ ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరైన సిరికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ,కొత్తపేట చిన్న గ్రామం అయినప్పటికీ సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటి ఆడపడుచులు ముగ్గుల పోటీలో పాల్గొని అందమైన ముగ్గులు వేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పిట్టల రాజు, మాజీ సర్పంచ్ పిట్టల లాస్య ప్రసాద్, వార్డు సభ్యులు ఊరడి అనిత,దానవేణి రాణి, ఊరడి పూజ,గ్రామస్తులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి జాతర ప్రారంభం



**శంకరపట్నం:జనవరి14(మనవార్త ప్రతినిధి)** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లా వద్ద పురాతనమైన వీరభద్ర స్వామి జాతర బుధవారం ప్రారంభమైంది.పురాతనమైన దేవాలయాన్ని గ్రామస్థులు దాతల సాయంతో పునరుద్ధరించారు.కాకతీయ-నైజాం కాలంనాటి ఈ పురాతనమైన ఆలయానికి అత్యంత శోభ ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గోల్యాల గంగాధర్ స్వామి భోగి పండుగ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.ఈరోజు మకర సంక్రాంతి సందర్భంగా బండ్లు తిరుగుట భక్తుల దర్శనం,రేపు శుక్రవారం కనుమ పండుగ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు,బియ్యం చూపించుట,వీరబోనాలు సమర్పించుట శుక్రవారం రాత్రి 12 గంటలకు అగ్నిగుండ ప్రజ్వలన, అష్టదిగ్బంధన,శనివారం రోజున ఉదయం 5 గంటలకు అష్టబలి,అగ్నిగుండాలు,10 గంటలకు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని ఆలయ చైర్మన్,ధర్మకర్త,కమిటీ సభ్యులు పేర్కొన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు ఆప్తులు కాగలరని వారు కోరారు.

## సర్పంచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్...




**చిన్న శంకరం పేట జనవరి 14 (మన వార్త ప్రతినిధి)** చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వీరభద్రుని ఆలయం వద్ద బుధవారం నాడు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.సర్పంచ్ మాట్లాడుతూ. గ్రామంలోని ప్రతి ఆలయం పరిశుభ్రంగా ఉంచుతామని పలకవర్గం సభ్యులు అన్నారు. రేపు సంక్రాంతి నాడు వీరభద్రుని ఆలయం లో అభిషేకం అర్చన కార్యక్రమాలు నిర్వహిస్తామని సాయంత్రం బండ్లు చల్లటి పందిరి నిర్వహించడం జరుగుతుందని గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో హాజరుకావాలని సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులు భూపాల్,రామకృష్ణ, స్వామి, గౌతమి, లావణ్య, మౌనిక, నర్సింలు, నరేష్, పంచాయతీ సిబ్బంది కారోబార్ పెంట స్వామి, పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్రనాయకులు ఎన్వి సుభాష్ పుట్టినరోజు వేడుకలు

**-వీరబద్రస్వామి దేవాలయంలో 101కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసిన...**

**-సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు...**





**బెజ్జంకి, జనవరి 14( మన వార్త ప్రతినిధి )** భారత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు మనవడు నచ్చరాజు వెంకట సుభాష్ 65వ, పుట్టినరోజు వేడుకలు సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా,అనంతరం సముద్రాల శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో 101కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్వి సుభాష్ భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు గా, ప్రధాని నరేంద్ర మోడీ కీ అత్యంత నమ్మకం కలిగిన కార్యకర్తగా గుర్తింపు పొంది సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామానికి చెందిన ఇతను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చలవతో అభివృద్ధి కీ కృషి చేస్తున్నారని,ఎన్వి శుభాష్ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆ భగవంతుణ్ణి వేడుకున్నారు.ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఉప్పుల దేవేందర్, రమేష్, వెంకట్ చారి తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా తగిలి మహిళకు తీవ్ర గాయాలు...



**చేగుంట జనవరి 14 ( మన వార్త ప్రతినిధి)** ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను వినియోగించడంతో మండల కేంద్రంలో ఓ మహిళ కుడి కాలికి తగిలి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది, పతంగి ఎగరవేసిన సమయంలో చైనా మాశీజా తగలడం తో చిన్న శంకరంపేట మండలం చందంపేట గ్రామానికి చెందిన మనెమ్మ కుడి కాలికి తగలడంతో లోతైన గాయాలు ఏర్పడి అధిక రక్తస్రావం జరిగింది సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు ప్రభుత్వం చైనా మాంజాను వాడకూడదని హెచ్చరించినప్పటికీ వాడకం కొనసాగుతున్నడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఇటువంటి ఘటనలు మరిన్ని జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కొండపూర్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్



**ముస్తాబాద్, మన వార్త జనవరి 14** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపురం సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామంలో సర్పంచ్ పెంధ్యాల మహిపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎక్కల దేవి పర్శరాములు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గారు మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అదేవిధంగా శరీర దారుఢ్యాన్ని పెంచుతాయని యువతలో ఐక్యతను పెంపొందిస్తాయని నేటి యువత అంతర్జాల మాయలో పడి సెల్ ఫోన్లకే అంకితమై తమ సమయాన్ని వృథా చేసుకోకూడదని అతను కోరారు విజేతలకు బహుమతులు మొదటి చిగురు శేఖర్ టీమ్ రెండవ బహుమతి బంటు సాగర్ బహుమతులు అందించిన సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు విజయరామారావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొంపేల్లి సురేందర్ రావు, కొండాపూర్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మదేవి రెడ్డి, దీ=హా పార్టీ నాయకులు నిమ్మ రాజిరెడ్డి, చారి, చాకలి దేవయ్య గంధం మల్లయ్య యూత్ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజా భవన్ లో మంత్రి సీతక్క ను మర్యాదపూర్వకంగా కలిసిన రాధ టీఎంటి యాజమాన్యం



**ములుగు జనవరి 14 మనవార్త** హైదరాబాద్ ప్రజా భవన్ లో మంగళవారం రోజున ఉదయం తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మత్యులు ధనుసరి అనసూయ సీతక్క ను రాధ టీఎంటి యాజమాన్యం మర్యాదపూర్వకంగా కలిశారు.ములుగు జిల్లా తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం లో జరుగుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్న తరుణంలో ,,మంత్రి సీతక్క గారి సేవ కృషి పాత్ర అద్భుతమని మంత్రి కి పుష్ప గుచ్చం ఇచ్చి వారికి అభినందనలు తెలియజేశారు.రాధా టీఎంటి స్టీల్ కంపెనీ చైర్మన్ సునీల్ సరాఫ్,ఎండీ సుమన్ సరాఫ్ ఆదేశాల మేరకు గడిచిన సంవత్సరాల నుండి అమ్మ వార్ల సేవలో భాగంగా రాధ టీఎంటి ఫ్రీ మినరల్ డ్రింకింగ్ వాటర్ ప్రతి జాతరలో లక్షలాది మంది భక్తులకు అందిస్తున్నామని తెలియజేశారు.అలాగే ఈ సంవత్సరం జనవరి 28 నుండి 31 వరకు జరగబోయే మహా జాతర లో రాధ టీఎంటి కంపెనీ చైర్మన్ సునీల్ సరాఫ్,ఎండీ సుమన్ సరాఫ్ ఆదేశాల మేరకు, మంత్రి సీతక్క సూచనలు సలహాల మేరకు,ములుగు జిల్లా ఎస్పీ రామనాథ్ కేకన్ చొరవతో ,సంబధిత ప్రభుత్వ అధికారుల సహాయ సహకారాలతో ,ములుగు డీలర్ గంగిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్రీ మినరల్ డ్రింకింగ్ వాటర్ క్యాంప్ ని ప్రారంభిస్తున్నామని కంపెనీ జనరల్ మేనేజర్ వీరేష్ కుమార్ తెలియజేశారు.ఈ యొక్క ఫ్రీ మినరల్ డ్రింకింగ్ వాటర్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావాలని మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు.రాధా టీఎంటి రైనో 600 నూతన సంవత్సర క్యాలెండర్ ను మంత్రి సీతక్క గారు ఆవిష్కరించారు.అనంతరం సీతక్క మాట్లాడుతూ గత సంవత్సరం కూడా రాధ టీఎంటి కంపెనీ ఫ్రీ మినరల్ డ్రింకింగ్ వాటర్ క్యాంప్ తన చేతులు మీదుగా ప్రారంభించామని ,విజయవంతం అయింది అని మంత్రి సీతక్క గుర్తుచేశారు.రాధ టీఎంటి కంపెనీ వారు చేస్తున్న సేవలు మహా అద్భుతం వారికి అమ్మ వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వీరేష్ కుమార్, బ్రాండింగ్ మేనేజర్ నరేష్ గౌడ్ , వరంగల్ ఇంచార్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీ...

**ముస్తాబాద్, మన వార్త జనవరి 14** ముస్తాబాద్ మండల కేంద్రంలో ముగ్గుల పోటీ నిర్వహించిన జరిగింది. మట్ట వెంకటేశ్వర్ రెడ్డి యువసేన్యం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా పోటా పోటీగా మహిళలు ముగ్గులు వేసి బహుమతులు గెలుచుకున్నారు. ఇందులో గెలుపొందిన వారు మొదటి బహుమతి పుల్లూరి రచన రెండో బహుమతి పూస అనూష మూడో బహుమతి దబ్బేడ అనుశ్రీ లకు గ్రామ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర రెడ్డి ఉప సర్పంచ్ తల్లా విజయ్ రెడ్డి డాక్టర్ చింతోజు శంకర్, డాక్టర్ రాజారాం, ఎస్సై గణేష్ పాలక వర్గ సభ్యులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి,మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ,తాండ్ర గోపాల్,గంగాల రాజేష్,తుమ్మ రాజేందర్,అబ్రమేని ప్రశాంత్, పర్స అఖిల్, అబ్రమేని అరుణ్,తదితరులు పాల్గొన్నారు



## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



**మధిర,జనవరి14( మన వార్త ):**మధిర పట్టణంలోని సాయి నగర్ లో భోగి పండుగ సందర్భంగా సాయి నగర్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముందుగా భోగి పండుగ సందర్భంగా తెల్లవారుజామున భోగి మంటల కార్యక్రమం కాలనీవాసులు అందరూ పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని వారి నైపుణ్యతను ప్రదర్శించారు. పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ..... కాలనీలో ప్రతి పండుగను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని పండుగ నిర్వహించడం వలన చిన్నారులకు పండుగ యొక్క విశిష్టత, సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకునేందుకు దోహదపడతాయని అన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు సాయి నగర్ గణేష్ కమిటీ సభ్యులు బహుమతి ప్రధానం అందజేశారు.

## రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు




**కల్వకుర్తి.జనవరి 14. మన వార్త ప్రతినిధి** కల్వకుర్తి నియోజకవర్గంలో ఉప్పల వెంకటేష్ ప్రజా నాయకుని జన్మదిన సందర్భంగావెదటగాతలకొండపల్లిలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొనిపడకల్ గ్రామంలో మరియు కడ్తల్ మండల కేంద్రం లో మాడ్గుల్ మండల కేంద్రం లో అమన్ గల్ మండల కేంద్రం లో వెల్దండ మరియు కల్వకుర్తి మండలం లో .పుట్టినరోజు సందర్భంగా వివిధ మండలాల కేంద్రం లో తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కేక్ కటింగ్ చేసి మండల నాయకులతో మిఠాయిలలు పంచుకొని ఘనంగా పుట్టినరోజు జరుపుకోవడం జరిగిందిఅదేవిదంగా సంక్రాంతి పర్వదినాన్నిపురస్కరించుకొని ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు మొదటి బహుమతి 3000రూపాయలు పట్టుచీరరెండవ బహుమతి పట్టుచీర 2000 రూపాయలు బెస్ట్ 5 పట్టుచీరలు మండల టిఆర్ఎస్ నాయకులతో కలిసి బహుమతులు ఉప్పల వెంకటేష్ గారు అందజేయడం జరిగింది

## రూ.15 కోట్లతో మధిర పట్టణ అభివృద్ధికి కార్యాచరణ

**-డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క....**

**-మధిర మున్సిపాలిటి పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన డిప్యూటీ సీఎం....**



**మధిర ,జనవరి14( మన వార్త):**15 కోట్ల రూపాయల వ్యయంతో మధిర పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.డిప్యూటీ సీ ఎమ్ బుధవారం మధిర పట్టణంలో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రిమల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ భోగి పండుగ నాడు మధిర పట్టణ అభివృద్ధి కోసం 15 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని, వీటిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మధిర పట్టణ ప్రజలకు మౌళిక వసతుల కల్పన లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సిపిఓ ఏ. శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, మధిర మునిసిపల్ కమీషనర్ సంపత్ కుమార్, పంచాయతీ రాజ్ ఇఇ మహేష్ బాబు, మధిర మండల తహసీల్దార్ రాంబాబు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను తీవ్ర స్థాయిలో ఖండించిన టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్



**సిద్దిపేట జిల్లా, జనవరి 14, మన వార్త ప్రతినిధి** మహిళా ఐఏఎస్ అధికారిపై మీడియాలో ప్రసారమైన కథనంపై ఎటువంటి విచారణ చేయకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండా సిట్ పోలీసులు ముగ్గురు సీనియర్ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా టిడబ్ల్యుజేఎఫ్ డివిజన్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎన్టీవీలో వచ్చిన కథనానికి జర్నలిస్టులు దొంతు రమేశ్, పరిపూర్ణ చారి, సుధీర్ లను బాధ్యులను చేస్తూ 'సిట్ట పోలీసులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నేరుగా అరెస్టు చేయడం దారుణమని మండిపడ్డారు. మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే కథనాలకు ఆ సంస్థ ఎడిటర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో పాటు సంస్థ యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆరోపించారు.సంస్థలో పని చేసే జర్నలిస్టులను, ఇతర ఉద్యోగులను బాధ్యులను చేసి అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు.తమది ప్రజా ప్రభుత్వం అని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన ప్రభుత్వంలోని అధికారులు అనుసరిస్తున్న విధానంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిజంలో మూడు దశాబ్దాలుగా పని చేస్తున్న ఈ ముగ్గురు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయటం వెనుక కుట్ర ఉన్నట్లు కనిపిస్తోందని తెలిపారు .సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడే సదరు జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమంలోనూ ముందుండి పోరాటం చేశారని తెలిపారు. జర్నలిజం వృత్తిలో సరైన వేతనాలు లేకపోయినా...వృత్తి పట్ల ఆసక్తితో యాజమాన్యాలు చెప్పినట్లు పని చేయాల్సివస్తుందని అన్నారు. బలహీనవర్గానికి చెందిన ఈ ముగ్గురు జర్నలిస్టులను సిట్ అధికారులు అరెస్టు చేయటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. బాధ్యులైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా అమాయక జర్నలిస్టులను అరెస్టు చేయడం సరైందికాదని, ఈ అక్రమ అరెస్టులు ఇతర జర్నలిస్టులను భయపెట్టేందుకు చేస్తున్న చర్యలని అన్నారు. ఈ సమావేశంలో టి డబ్ల్యూ జేఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు వరియోగుల మురళీధర్ స్వామి, జిల్లా కార్యదర్శి మహ్మద్ ఖుద్రత్ అలీ, డివిజన్ అధ్యక్షుడు గుర్రపు శ్రీనివాస్ డివిజన్ కార్యదర్శి జానవేణి శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు కొత్త పూర్ణచందర్,జిల్లా కార్యవర్గ సభ్యులు చెరుకు సతీష్,, మీడియా కన్వీనర్ మార్క రాజు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కడ్తాల్ ప్రజలకుభోగి,సంక్రాంతి,కనుమ శుభాకాంక్షలు : కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్



**కల్వకుర్తి.జనవరి 14. మన వార్త ప్రతినిధి** కడ్తాల్ నియోజకవర్గ ప్రజలు భోగి, సంక్రాంతి,కనుమపండుగలనుఆనందోత్సాహాలమధ్యజరుపుకోవాలని మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆయన భోగి, సంక్రాంతి, కనుమశుభాకాంక్షలుతెలిపారు. ఈసందర్భంగాఆయనమాట్లాడుతూసంస్కృతి–సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ వేళతెలుగులోగిళ్లు అలనాటి అనుభూతులకు వేదికలుగా మారుతాయని అన్నారు. ప్రతిఒక్కరూపండుగసమయానికితమస్వగ్రామాలు,ఇళ్లకు చేరుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారని తెలిపారుగ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకించి ఉదయాన్నే వేసే ముగ్గులు,గొబ్బెమ్మలు, అక్కడి సందడి ఎంతో ఆనందాన్ని ఇస్తుందని చెప్పారుధాన్యం ఇళ్లకు చేరే ఈ సమయంలో రైతులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారుసిరిసంపదలతో ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారని పేర్కొన్నారు.గ్రామాలతో పాటు పట్టణాల్లో కూడా భోగి మంటలు, రంగురంగులముగ్గులు,గంగిరెద్దులవిన్యాసాలు,హరిదాసులపాటలు,గాలిపటాల సందడి పండుగ శోభను మరింత పెంచుతాయని అన్నారు. ఇళ్లల్లో పిండివంటలు, పశువుల అలంకరణలతో సంక్రాంతి పండుగ ఒక ప్రత్యేక వాతావరణాన్ని సంతరించుకుంటుందనితెలిపారుగాలిపటాలుఎగురవేసేసమయంలోప్రత్యేకజాగ్రత్తలుతీసుకోవాలని,ఎలాంటిప్రమాదాలుజరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కడ్తాల్ మండలప్రజలంతాపండుగనుప్రశాంతమైన,సురక్షితవాతావరణంలోఆనందంగాజరుపుకోవాలని ఆయన కోరారు.

## కొత్తకొండకు బయలుదేరిన ఎడ్లబండ్లు



**శంకరపట్నం:జనవరి14(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండలం కరీంపేట గ్రామం నుండి వరంగల్ జిల్లాలో నిర్వహించే కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరకు ఎడ్లబండ్లు ఊరేగింపుగా బయలుదేరాయి.గ్రామంలో అంకతి రాజయ్య కుటుంబ సభ్యులు ఆనవాయితీగా ప్రతి సంవత్సరం ఎడ్లబండ్లను కట్టుకొని ఊరేగింపుగా భోగి రోజున కొత్త కొండకు బయలుదేరుతారు. ఈ క్రమంలో గ్రామస్తులు బండ్లఅబశ్రీశ్రీవద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఊరేగింపు లో డప్పు దరువులతో, శివసత్తుల పూనకాలతో, కాగడాల వెలుగులతో శోభాయమానం సంతరించుకుంటుంది. ఈ కార్యక్రమంలో అంకతి భద్రయ్య,అంకతి కనకయ్య, అంకతి కుమారస్వామి, అంకతి ఐలయ్యలతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డిస్టిక్ వి 108 ఏ క్యాలెండర్ ఆవిష్కరించిన జూలూరి రమేష్ బాబు



**కల్వకుర్తి. జనవరి 14 మన వార్త ప్రతినిధి** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సేవలను మరింత విస్తరించాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరు రమేష్ బాబు కోరారు. మంగళవారం రాత్రి పట్టణంలోని వాసవి క్లబ్ భవనంలో డిస్టిక్ వి108ఏ.గవర్నర్ కల్మిచర్ల రమేష్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు.గవర్నర్ పరిధిలోని తొమ్మిది జిల్లాలలో సేవలు పెద్ద ఎత్తున చేపట్టి ఈ సంవత్సరం ఇంటర్నేషనల్ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని రమేష్ బాబు కోరారు. 108 ఎ పరిధిలో మొట్టమొదటిసారి క్యాలెండర్ రూపొందించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కల్మిచర్ల రమేష్ మాట్లాడుతూ సేవలకు వన్నె తెస్తామన్నారు. సేవలు చేసే ప్రతి క్లబ్ కు ప్రశంసా పత్రాలు, మొమెంటో లు బహుకరిస్తామని సేవలను పెద్ద ఎత్తున ప్రణాళిక బద్ధంగా చేపడుతామని చెప్పారు. ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కల్వ హరికృష్ణ, క్యాబినెట్ సెక్రెటరీ చంద్రశేఖర్ వలకొండ, క్యాబినెట్ ట్రెజర్ చిదిరె శ్రీనివాస్,ఆర్.సి. మలిపెద్ది శ్రీనివాస్, డిస్టిక్ ఇంచార్జ్ కె సి జి ఎఫ్ కల్మిచర్ల గోపాల్, జాయింట్ సెక్రెటరీ లు గుగ్గిళ్ళ శంకర్, జూలూరు సత్యం, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రచార కార్యదర్శి చిగుల్లపల్లి శ్రీధర్,కోఆర్డినేటర్ శ్రీనివాస్, జోన్ చైర్మన్లు బాదం రాఘవేందర్, పురం రాజేందర్, కల్వకుర్తి ప్రెసిడెంట్ సాయి లక్ష్మి, కార్యదర్శులు గోవిందు సంతోష్, గోవిందు మౌనిక, మాజీ అధ్యక్షులు దాచేపల్లి మనోహర్, కూన సంతోష్, కల్వా ఆంజనేయులు,గుబ్బ కిషన్, నరసింహులు గుప్త, గుబ్బ ప్రభాకర్, శ్రీకాంత్, ప్రశాంత్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స సహకార యూత్ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు



**శ్రీరంగాపురం జనవరి 14 : (మన వార్త ప్రతినిధి)** శ్రీరంగాపురం మండల కేంద్రంలో మత్స్య సహకార యూత్ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని మత్స్య సహకార సంఘం అధ్యక్షులు సోప్పరి వెంకటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతులు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల రంగవల్లులను వేశారని,ప్రథమ బహుమతి మనీష కు దాత చుక్క రాములు, ద్వితీయ బహుమతి కృష్ణవేణికి దాత కాళ్ళ బాలకృష్ణ, తృతీయ బహుమతి మానస పుష్పలత లకు దాతలు నాగరాజు,మేకల రంగస్వామి బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మత్స సహకార సంఘ సభ్యులు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రకృతితో ముడిపడిందని,రంగవల్లులలో యువతులు చక్కగా ప్రకృతి దృశ్యాలను చిత్రీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఖాజ,మత్స్య సహకార సంఘం పెద్దలు కృష్ణయ్య,రఘు,మూర్తి,ఆంజనేయులు,వెంకటయ్య,పెద్ద బుచ్చన్న మరియు ఆర్గనైజర్స్ లోకేష్,శరత్ కుమార్ యువకులు మరియు యువతులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో ట్రూ వేల్యూ షోరూమ్‌లో భారీ అగ్ని ప్రమాదం




**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, జనవరి 14 మన వార్త :** అల్వాల్ ప్రాంతంలో ఉన్న ట్రూ వేల్యూ కార్ షోరూమ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అకస్మాత్తుగా షోరూమ్‌లో మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి ఫైర్ ఇంజన్లతో చేరుకున్నారు. సిబ్బంది గంటల పాటు శ్రమించి ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.అయితే అగ్ని ప్రమాదం కారణంగా షోరూమ్‌లో ఉన్న పరికరాలు దగ్ధమై భారీ ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, పూర్తి స్థాయి విచారణ చేపడతామని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ట్రూ వేల్యూ షోరూమ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాదం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ భద్రతా చర్యలు మరింత కఠినంగా అమలు చేయాలని కోరుతున్నారు.

## జర్నలిస్టుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాపెబ్బేరు ప్రెస్ క్లబ్

**పెబ్బేరు జనవరి 14 (మనవార్త ప్రతినిధి)** ఎన్ టివి జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణ చారి, సుధీర్ లను అర్ధరాత్రి పూట అరెస్టు చేయడాన్ని పెబ్బేరు ప్రెస్ క్లబ్ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామని, అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో పోరాటం తప్పదు. జర్నలిస్టులను విడుదల చేసే వరకు ప్రెస్ క్లబ్ పక్షాన, యూనియన్లకు అతీతంగా పోరాటం చేస్తామని అధ్యక్షుడు బాలవర్ధన్, ప్రధాన కార్యదర్శి పరుషరాముడు, కోశాధికారి బుస్స రమేష్, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, కిరణ్ కుమార్ గౌడ్, తదిదతర కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించండి ప్రతి కాలనీ అభివృద్ధికి బాటలు వేయండి



**కల్వకుర్తి జనవరి14 మన వార్త ప్రతినిధి** కల్వకుర్తి పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీ 21 వార్డులో కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి.మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ 20వ వార్డ్ మాజీ కౌన్సిలర్లు పద్మ చిన్న.మబ్బు రామరాజు. మాజీ కౌన్సిలర్ అభ్యర్థి పోలా ప్రవీణ్ కుమార్. మైనార్టీ నాయకులు షాకేర్ లతో కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముమ్మర ప్రచారం చేపట్టారు. ముఖ్యంగా ఇంద్రానగర్ కాలనీలో ఎక్కడెక్కడ ఏ సమస్యలు ఉన్నాయి. సి.సి.రోడ్లు మురికి కాలువలు ఏక్కడ వెయ్యాలో అలాగే ఇందిరమ్మ ఇల్లు రాని వాళ్ళని కలిసి మాట్లాడి తప్పకుండా ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది. 20 వార్డులో మురికి కాల్వ పనులను పరిశీలించడం జరిగింది. కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో మాట్లాడి తక్షణమే త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చూస్తానని చెప్పడం జరిగింది.వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని మన ప్రాంత ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం మన అదృష్టమని కల్వకుర్తి నియోజకవర్గం లోని అన్ని వార్డులలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో మాట్లాడి అన్ని వార్డులలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగే విధంగా చూస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు.యువకులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా కాట్రావుల పండుగ..



**– ఆచారాన్ని కాపాడుకుంటున్న ఆ గ్రామఅబశ్రీశ్రీస్తులు**

**హుజురాబాద్, జనవరి 14(మనవార్త)** సంక్రాంతి పండుగ సందర్భంగా వ్యవసాయ బావుల వద్ద రైతులు జరుపుకునే కాట్రావుల పండుగ కనుమరుగై పోతున్న క్రమంలో హుజురాబాద్ మండలం చిన్నపాపయ్యపల్లి గ్రామంలో భోగి రోజు ఈ పండుగను గ్రామ సర్పంచ్ చల్లూరి చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పండుగను స్థానిక రైతులు ఘనంగా నిర్వఅబశ్రీశ్రీహించారు. ఎడ్లు, పశువులు కనుమరుగవుతున్న క్రమంలో ఈ గ్రామంలో ఉన్న పశువులకు కాట్రావుల పండుగ సందర్భంగా స్నానాలు చేయించి, కొమ్ములకు జాజు పూసి, పూల దండలువేసి తోరణాల కింది నుంచి తోలారు. రైతు జీవితంతో ముడిపడి ఉన్న ఎడ్లకు ఏడాదికి ఒక సారి సంక్రాంతి సందర్భంగా వచ్చే కాట్రావుల పండుగ ఒకప్పుడు ప్రతి గ్రామంలో రైతులు ఘనంగా జరుపుకునేవారు. అప్పట్లో పశువులు, నాగటెద్దులు, పాడిగేదెలతో రైతుల కొట్టాలు కళకళలాడేవి. ఇపుడు కాట్రావుల పండుగను జరుపుకునే రైతులే కరువైన నేపథ్యంలో చిన్నపాపయ్య పల్లి గ్రామంలో ఈ ఆచారాన్ని కాపాడుతూ రైతులు ఆదర్శంగా నిలిచారు. ఇక నుండి ప్రతి ఏటా ఇలాగే కాట్రావుల పండుగను జరుపుకుంటామని స్థానిక రైతులు తెలిపారు. రైతులు ఈ సంప్రదాయిన్ని కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ పై నాయకులతో సమావేశం..



**జమ్మికుంట, జనవరి 14( మన వార్త ప్రతినిధి):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్ ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ పై పలు పార్టీల నాయకులతో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రతి వార్డులో పోలింగ్ స్టేషన్ లలో ఫిర్యాదుల మేరకు మరొక్కసారి పునః పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు. పార్టీల నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చిన పోలింగ్ స్టేషన్ ల సమస్యలను ఆయన విశదీకరించి, దానిపై రెండు, మూడు రోజుల్లో పోలింగ్ స్టేషన్ లను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ వాణి లతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## బూత్ పటిష్టతకు కార్యకర్తలు సంసిద్ధం కావాలి..




**ఇల్లందకుంట,జనవరి14( మన వార్త ప్రతినిధి):**బూత్ పటిష్టతకు కార్యకర్తలు సంసిద్ధం కావాలని బిజెపి జిల్లా కార్యదర్శి అన్నారు.భారతీయ జనతా పార్టీ ఇల్లందకుంట మండల శాఖ అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో బూత్ నిర్మాణ్ అభియాన్ కార్యశాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి నరసింహ రాజు పాల్గొని మాట్లాడుతూ బిజెపి పార్టీ ప్రతి బూత్ ను గెలుచుకోవాలని కోరారు.బూత్ గెలిస్తే ఖచ్చితంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ కైవసం చేసుకుంటామని ఆశభావం వ్యక్తం చేశారు. ప్రతి బూతు గెలిస్తే తెలంగాణలో బిజెపి అధికారంలోకి కచ్చితంగా వస్తుందన్నారు.ప్రతి కార్యకర్త బూత్ నిర్మాణం కొరకు కంకణ బద్దులు కావాలన్నారు. ఈ దేశంలో భారతీయ జనతా పార్టీ బూత్ పటిష్టంగా ఉంది కాబట్టే చాలా రాష్ట్రాలలో విజయం సాధిస్తున్నామన్నారు. ప్రజలంతా భారతీయ జనతా పార్టీ వైపే ఉన్నారని చెప్పారు. తెలంగాణలో కూడా బూత్ పటిష్టం కావడానికి కార్యకర్తలు సంసిద్ధం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధానకార్యదర్శి ఆకుల రాజేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు, కన్వీనర్ అబ్బిడి తిరుపతి రెడ్డి, కో కన్వీనర్ గుత్తికొండ రాంబాబు, ఉప్పుల రమేష్, తడిగొప్పుల రమేష్, నల్ల లింగారెడ్డి, తాళ్ల లావణ్య,మడ్డి శ్రీనివాస్, మట్ట పవన్ రెడ్డి, మురహరి గోపాల్, ఉప్పు దుర్గయ్య, తాళ్ల పాపిరెడ్డి, చింతం ఐలయ్య,చీపాతి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి

**-ఎన్నికలు రాగానే భావోద్వేగ ప్రసంగాలతో కొందరు రాజకీయాలు చేస్తారు...**
**-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్....**

**వేములవాడ జనవరి 14 (మన వార్త)**వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు..బుధవారం



వేములవాడ పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించారు..వారు మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు..వేములవాడ పట్టణాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా, టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు.శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ఇప్పటికే 150 కోట్ల రూపాయలు మంజూరు చేశామని,పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే పట్టణంలో సుమారు 47 కోట్ల రూపాయలతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టామని, ఇది గత 50 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కీలకమైన అభివృద్ధి అని పేర్కొన్నారు.పట్టణ సుందరీకరణలో భాగంగా మల్లారం జంక్షన్ నుండి బతుకమ్మ తెప్ప, బ్రిడ్జి మీదుగా జగిత్యాల బస్ స్టాండ్ (సాయి రక్ష) వరకు మొత్తం 3.6 కిలోమీటర్ల పరిధిలో 146 పోల్స్‌తో సుందరీకరణ పనులకు సుమారు 5 కోట్ల 25 లక్షల రూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. గతంలో బిఆర్ఎస్, బీజేపీ పాలనలతో పోల్చి, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు.ప్రజలు విజ్ఞులు, చైతన్యవంతులు అని, జరుగుతున్న పరిణామాలను గమనించి తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు గెలిచి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తేనే వేములవాడ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు.భోగి, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా మరోసారి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వేములవాడ పట్టణ ప్రజలు తమ ఆశీస్సులు, సహకారం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

## మౌలాలి రైల్వే డీజిల్ షెడ్‌లో కార్మికుల భారీ ఆందోళన

**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, జనవరి 14, మనవార్త.**హైదరాబాద్ డివిజన్ పరిధిలోని మౌలాలి డీజిల్ షెడ్‌లో బుధవారం సుమారు 300 మంది కార్మికులు భారీగా నిరసన కార్యక్రమం చేపట్టారు.



2013లో రైల్వే శాఖలో ఉద్యోగంలో చేరిన సూపర్వైజర్ ఎస్ఎస్ఈ వెంకట్ రాజేష్ కుమార్ (39) (భార్య, ముగ్గురు పిల్లలు), బాగ్ అంబర్ పేట్ లో నివాసం ఉంటూ, అధికారుల నుంచి కొనసాగుతున్న మానసిక ఒత్తిడిని భరించలేక మంగళవారం మధ్యాహ్నం 12:45 గంటల సమయంలో విద్యానగర్--కాచిగూడ రైల్వే లైన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటనకు నిరసనగా ఈ ఆందోళన నిర్వహించారు. కార్మికుల కథనం ప్రకారం, విధి నిర్వహణలో భాగంగా రాజేష్‌పై అనవసర పని భారం, తరచూ ఒత్తిడి, మాటలతో వేధింపులు కొనసాగాయని వారు ఆరోపించారు. ఈ కారణంగా తీవ్ర మానసిక క్షోభకు గురైన రాజేష్ చివరికి ఈ ఘోర నిర్ణయం తీసుకున్నాడని తెలిపారు. ఈ ఘటన రైల్వే శాఖలో తీవ్ర కలకలం సృష్టించిందని, ఉద్యోగుల భద్రతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని కార్మికులు పేర్కొన్నారు. ఈ ఘటనకు డీజిల్ మెకానికల్ ఇంజనీర్ (డీఎంఈ) సునీల్ కుమార్, అసిస్టెంట్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ (ఏడీఎం) వి.ఆర్. రాజు ప్రత్యక్షంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని కార్మికులు ఆరోపించారు. వారి ఒత్తిడే రాజేష్ మరణానికి కారణమని పేర్కొంటూ, అన్ని ట్రేడ్ యూనియన్లకు అతీతంగా మౌలాలి డీజిల్ షెడ్‌కు చెందిన కార్మికులు ఏకమై నిరసన వ్యక్తం చేశారు. బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని, నిజాలు వెలుగులోకి తీసుకురావాలని కార్మికులు కోరారు. మృతుడు రాజేష్‌కు భార్యతో పాటు ముగ్గురు చిన్నపిల్లలు ఉండటంతో కుటుంబ భవిష్యత్ అంధకారమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి తక్షణమే తగిన ఆర్థిక సహాయం అందించడంతో పాటు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రైల్వే శాఖలో పనిచేస్తున్న కార్మికులపై కొనసాగుతున్న మానసిక ఒత్తిడి, అధిక పని భారం తగ్గించాలని, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కార్మికులు ప్రభుత్వాన్ని, రైల్వే ఉన్నతాధికారులను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన మార్గదర్శకాలు రూపొందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## కమనీయం గోదా రంగనాథుల కళ్యాణం..



**జమ్మికుంట,జనవరి14( మన వార్త ప్రతినిధి):** గోదాదేవి రంగనాథుల కళ్యాణం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా జరిగింది.ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని వెంకటాద్రి నగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం గోదా రంగనాయకుల కళ్యాణం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండుగగా జరిగింది.కల్యాణాన్ని భక్తులు తిలకించి తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ ముక్క జితేందర్ గుప్తా,ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## నేడు భోగీ పండుగ సందర్భంగా పలువురికి అయ్యప్ప స్వామి ఆలయంలో శుభాకాంక్షలు తెలిపిన

### బీసీ నేతలు కొండ దేవయ్య, పొలాస నరేందర్



**వేములవాడ జనవరి 14 (మన వార్త)** బోగీ పండుగ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రజలు ఘనంగా,సంతోషంగా పండుగ జరుపుకోవాలని స్వామివారిని వేడుకున్న కొండ దేవయ్య, పొలాస నరేందర్ బోగీ పండుగ శుభ సంధర్భంగా, తిప్పాపురం అయ్యప్ప స్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహించి, బొగబాగ్యాలనిచ్చే బోగీ పండుగతో పాటుగా,సంక్రాంతి,కనుము, పండుగలను ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని, ప్రజలందరికీ జీవితాల్లోకి భోగభాగ్యాలు తీసుకురావాలని , ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని,పాడి పంటలు సమృద్ధిగా పండాలని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య,ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘం ఇంచార్జ్ పొలాస నరేందర్లు స్వామి వారిని వేడుకున్నారు.సంక్రాంతి,కనుమ, ముక్కనుము ,బోగీ పండుగలను పురస్కరించుకొని ఆలయంలో అయ్యప్ప స్వామి వారి భక్తులకు,పట్టణ ప్రజలకు బీసీ నేతలు కొండ దేవయ్య, పొలాస నరేందర్లు పలువురికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేసారు.

## జర్నలిస్టులను అరెస్టు చేయడం అన్యాయం...



**- టి డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ కే బాపురావు...**

**కరీంనగర్, జనవరి 14( మన వార్త ప్రతినిధి):**ఎన్టీవీ మీడియాలో ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై ప్రసారమైన కథనంపై ఎటువంటి విచారణ చేయకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండా సిట్ పోలీసులు ఓ ముగ్గురు సీనియర్ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఎన్టీవీలో వచ్చిన కథనానికి జర్నలిస్టులు దొంతు రమేశ్, పరిపూర్ణ చారి, సుధీర్ లను బాధ్యులను చేస్తూ 'సిట్ట పోలీసులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నేరుగా అరెస్టు చేయడం దారుణమని ఫెడరేషన్ రాష్ట్ర కో కన్వీనర్ కుడుతాడి బాపురావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే కథనాలకు ఆ సంస్థ ఎడిటర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో పాటు సంస్థ యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని, కానీ ఆ సంస్థలో పని చేసే జర్నలిస్టులను, ఇతర ఉద్యోగులను బాధ్యులను చేసి అరెస్టు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తమది ప్రజా ప్రభుత్వం అని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...తన ప్రభుత్వంలోని అధికారులు అనుసరిస్తున్న విధానంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిజంలో మూడు దశాబ్ధాలుగా పని చేస్తున్న ఈ ముగ్గురు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయటం వెనుక కుట్ర ఉన్నట్లు కనిపిస్తోందని, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడే సదరు జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమంలోనూ ముందుండి పోరాటం చేశారని తెలిపారు. జర్నలిజం వృత్తిలో అనేక మంది జర్నలిస్టులు బహుజన వర్గాలకు చెందినవారని, సరైన వేతనాలు లేకపోయినా...వృత్తి పట్ల ఆసక్తితో యాజమాన్యాలు చెప్పినట్లు పని చేయాల్సివస్తుందని అన్నారు. బలహీనవర్గానికి చెందిన ఈ ముగ్గురు జర్నలిస్టులను సిట్ అధికారులు అరెస్టు చేయటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని బాపురావు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, సిట్ పర్యవేక్షణాధికారి సజ్జనార్ కు విజ్ఞప్తి చేశారు. బాధ్యులైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా అమాయక జర్నలిస్టులను అరెస్టు చేయడం సరైందికాదని, ఈ అక్రమ అరెస్టులు ఇతర జర్నలిస్టులను భయపెట్టేందుకు చేస్తున్న చర్యలని అన్నారు.

## బిజెపి, బీఆర్ఎస్ ఆటలు సాగవు..



**కరీంనగర్, జనవరి 14( మన వార్త ప్రతినిధి):** ఇకపై కరీంనగర్లో బిజెపి బీఆర్ఎస్ ఆటలు సాగవనీ, ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ డంకా మోగిస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.కరీంనగర్లో బుధవారం 39 వ డివిజన్ కు చెందిన బిజెపి నాయకుడు తంగెళ్ల విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో పలువురు బిజెపి నాయకులు రాజేందర్ రావ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రాజేందర్ రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ కరీంనగర్లో కాంగ్రెస్ కు ఇక తిరుగు లేదని ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి తీరుతుందని తెలిపారు. ప్రస్తుతం బిజెపి బీఆర్ఎస్ పార్టీని కరీంనగర్ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలంతా కాంగ్రెస్ వైపే చూస్తున్నారని తెలిపారు. బిజెపి నేతలు వి ప్రసాద్ ఎం ప్రవీణ్ గణేషు ఎస్ అనిల్ ఎస్ అశోక్ ఎస్ మార్కండేయులు సంపత్ క్రాంతి సిలగాని రవి వద్నాల రాజమౌళి ఎస్ ప్రవీణ్ తోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతుల రమేష్ తో పాటు పలువురు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు బుధవారం ఏకాదశి పురస్కరించుకొని కరీంనగర్ మార్కెట్ రోడ్ లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు అర్చకులు రాజేంద్ర రావు పేరిట అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..



**పెబ్బేరు.జనవరి14 మన వార్త ప్రతినిధి** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సమన్వయంతో అమలు చేస్తుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.పెబ్బేరు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంఖుస్థాపన చేశారు.మంత్రులతో పాటుగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.పెబ్బేరు పట్టణంలో రూ.15 కోట్లతో వివిధ వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, మరియు జంక్షన్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు.అదేవిధంగా పెబ్బేరు పట్టణంలో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.పెబ్బేరు బస్టాండ్ లో రూ. కోటి వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.పెబ్బేరు పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 2000 టన్నుల సామర్థ్యం గల గోదామును ప్రారంభించారు.అనంతరం పెబ్బేరు పట్టణంలో రూ.1.75 కోట్లతో 40 కమ్యూనిటీ హాల్ ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.పెబ్బేరు మండల పరిధిలో నూతనంగా నిర్మించిన 33/11 విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవం తోమాలపల్లి గ్రామ శివారులో రూ.1.76 కోట్లతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రులు ప్రారంభించారు.అదేవిధంగా, రూ.1.87 కోట్లతో ఘనపురం మండలం అల్మాయిపల్లి,రూ.2.05 కోట్లతో పెద్దమందడి మండలం మంగంపల్లిలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలను కూడా ఇక్కడి నుంచే ప్రారంభించారు.ఈ సందర్భంగా విలేకరులతో మంత్రులు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతి పేదవాడికి అండగా నిలుస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో అమలు చేస్తోందన్నారు.అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తూ ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు.కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు


## రోడ్డు భద్రత అవగాహనపై ముగ్గుల పోటీలు..

**-సందర్శించి అభినందించిన వెహికల్ ఇన్స్పెక్టర్...**

**జమ్మికుంట/ హుజూరాబాద్,జనవరి14( మన వార్త ప్రతినిధి):** జాతీయ రోడ్డు రవాణా భద్రత మాసోత్సవ సందర్భంగా రవాణా శాఖలో హుజురాబాద్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.వీటిని రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలలో భాగంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ కంచి వేణు మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరం ముందుగా బయలుదేరి క్షేమంగా గమ్యాన్ని చేరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటార్ వాహనాలు నడపకూడదు. ట్రాఫిక్ ను గమనించి సహనంతో దాటాలి, క్షేమముగా చేరుటకు ఏకైక మార్గం, డ్రైవర్ల తమ పక్కన ఎవరిని ఎక్కించుకోకూడదు. అతివేగం ప్రమాదకరం మలుపులు ఉండే ప్రదేశాలలో వాహనాన్ని నెమ్మదిగా నడపాలి. సరియగు హారన్ ఉపయోగించాలి. రాత్రి సమయంలో ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు హెడ్ లైట్ డిప్ చెయ్యాలి. నిర్ధారిత స్థలంలో వాహనములను పార్కు చేయాలి. రాత్రి వేళలో వాహనాన్ని నిలిపించినప్పుడు పార్కింగ్ లేట్లు తప్పనిసరిగా వేయాలి, వాహనము నడిపేటప్పుడు పక్కవారితో సంభాషించకూడదు. వాహనము మలుపు తిరిగినప్పుడు, నిలుపుకున్నప్పుడు చేతితో సరైన సంకేతాలు ఇవ్వాలి. పరిమితి మించి మోటార్ క్యాబ్ లో ప్రయాణికులను తీసుకువెళ్లకూడదు.వాహనం నడిపేట ప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. ఈ విషయాలను ప్రతి వాహనదారులు గమనించాలని కోరారు.ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని వాపోయారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్క వ్యక్తి నిబంధనలను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఈ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరికి వాటిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్పోర్ట్ కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డ్ బుర్ర సురేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## మచ్చ బొల్లారం ద్వారకా నగర్‌లో విషాదం డిగ్రీ విద్యార్థిని రుతిక ఆత్మహత్య



**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, జనవరి 14 మన వార్త :**అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మచ్చ బొల్లారం ద్వారకా నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. లయోలా డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న రుతిక (19) ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.వివరాల ప్రకారం, రుతిక తరచుగా మొబైల్ ఫోన్ వాడుతుండటంతో తల్లి ఆమెను మందలించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రుతిక, కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న అల్వాల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. యువతి ఆత్మహత్య ఘటన స్థానికంగా కలకలం రేపింది. పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు.

## చిన్న పొదుపే మహా భద్రతగా మారితే..



**హైదరాబాద్** పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం ద్వారా తక్కువ మొత్తంతోనే భవిష్యత్తుకు గట్టి భద్రత ఏర్పరుచుకోవచ్చు. రోజుకు కేవలం 200 చొప్పున పొదుపు చేస్తే దీర్ఘకాలంలో 10 లక్షలకు మించి మొత్తం కూడబెట్టే అవకాశం ఈ పథకంలో ఉంటుంది. ప్రస్తుతం ఈ ఖాతాకు సంవత్సరానికి 6.7 శాతం వడ్డీ అందిస్తున్నారు. ప్రభుత్వ హామీ ఉండటంతో పెట్టుబడులకు పూర్తి భద్రత లభిస్తుంది.ఈ పథకంలో ఖాతా ప్రారంభించడానికి కనీసంగా 100 మాత్రమే సరిపోతుంది. మొదట 5 సంవత్సరాల కాలపరిమితితో ఖాతా తెరవచ్చు. అవసరమైతే మరో 5 సంవత్సరాల పాటు పొడిగించుకునే అవకాశం కూడా ఉంటుంది. ఖాతా తెరిచిన 1 సంవత్సరం తర్వాత డిపాజిట్ మొత్తంలో 50 శాతం వరకు రుణం పొందవచ్చు. ఈ రుణంపై కేవలం 2 శాతం వడ్డీ మాత్రమే వసూలు చేస్తారు. అలాగే 3 సంవత్సరాలు పూర్తయ్యాక ఖాతాను ముందుగానే ముగించుకునే సౌకర్యం కూడా ఉంది.రోజుకు 200 చొప్పున 10 సంవత్సరాల పాటు పొదుపు చేస్తే మొత్తం డిపాజిట్ 7.20 లక్షలు అవుతుంది. దీనిపై సుమారు 2.05 లక్షల వడ్డీ వచ్చి మెచ్యూరిటీ సమయానికి మొత్తం 10.25 లక్షలు అందుతాయి. చిన్న పొదుపుతో పెద్ద లక్ష్యాన్ని చేరుకోవాలనుకునే వారికి ఈ పథకం మంచి అవకాశంగా నిలుస్తోంది.

## భోగి పండుగ నాడు భగ్గుమన్న బంగారం వెండి ధరలు..!



**హైదరాబాద్** భోగి పండుగ సందర్భంగా సంప్రదాయంగా బంగారం, వెండి కొనుగోళ్లు ఎక్కువగా జరిగే సమయంలోనే ధరలు ఒక్కసారిగా భారీగా పెరగడంతో వినియోగదారులు ఆశ్చర్యానికి గురయ్యారు. బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు గణనీయంగా ఎగబాకి పండుగ కొనుగోళ్లపై ప్రభావం చూపుతున్నాయి.తాజా రేట్ల ప్రకారం 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ.1000 పెరుగుదల నమోదై రూ.131650కి చేరింది. అలాగే 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.1090 పెరిగి రూ.143620గా కొనసాగుతోంది. వెండి ధరల పెరుగుదల మరింతగా కనిపించింది. కిలో వెండిపై ఏకంగా రూ.15000 పెరగడంతో ప్రస్తుతం రూ.307000 వద్ద ట్రేడవుతోంది.అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, డాలర్ మారకం విలువలో మార్పులు, దేశీయంగా డిమాండ్ పెరగడం వంటి కారణాలతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ ధరలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సమానంగా అమల్లో ఉంటాయని బులియన్ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ధరలు పెరగడంతో కొంతమంది కొనుగోళ్లను వాయిదా వేసుకుంటుండగా, మరికొందరు భవిష్యత్తులో ఇంకా పెరుగుతాయనే అంచనాతో కొనుగోళ్లు కొనసాగిస్తున్నారు.

# పండగ మంటలో మాంసం ధరలు

## చికెన్, మటన్ కొనాలంటే జేబుకు చుక్కలే..!!




**హైదరాబాద్** సంక్రాంతి పండగ వేళ మాంసాహార వినియోగం భారీగా పెరగడంతో చికెన్, మటన్ ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గత నెల వరకు కిలో చికెన్ ధర 230 నుంచి 240 మధ్యలో ఉండగా, ప్రస్తుతం అది 350కి చేరింది. అలాగే మటన్ ధరలు 800 నుంచి ప్రారంభమై ఇప్పుడు 1050 నుంచి 1250 వరకు పలుకుతున్నాయి. దీంతో పండగకు ప్రత్యేక వంటలు చేసుకోవాలనుకునే సామాన్యులు ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో దేవతలకు కోళ్లను సమర్పించే సంప్రదాయం ఉండటంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. పట్టణాల్లో కుటుంబ వేడుకలు, హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగం అధికంగా ఉండటంతో సరఫరా తక్కువగా మారింది. రవాణా ఇబ్బందులు, ఇంధన ఖర్చుల పెరుగుదల కూడా ధరలపై ప్రభావం చూపుతున్నాయి.పండగ అనంతరం కొంత మేర ధరలు తగ్గే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ పండగ రోజులలో మాత్రం మాంసాహార కొనుగోళ్లకు ఎక్కువ ఖర్చు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. అవసరాన్ని బట్టి ముందుగానే కొనుగోలు చేయడం, ఖర్చును నియంత్రించుకోవడం మంచిదని వినియోగదారులకు సూచిస్తున్నారు.

## ఆయుష్ ఎంపికపై కోచ్ ఓపెన్అప్ అసలు కారణం ఇదేనా..!




**ముంబై** గాయంతో జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ స్థానంలో యువ ఆటగాడు ఆయుష్ బదోనీకి వన్డే జట్టులో చోటు దక్కడం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. లిస్ట్ ఏ క్రికెట్‌లో కనీసం 1000 పరుగులు కూడా చేయని ఆటగాడిని ఎలా ఎంపిక చేశారంటూ సోషల్ మాధ్యమాల్లో పలువురు ప్రశ్నలు సంధించారు. రియాన్ పరాగ్, రింకూ సింగ్ లాంటి ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లను పక్కన పెట్టి బదోనీకి అవకాశం ఇవ్వడంపై ఆశ్చర్యం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టత ఇచ్చారు. రాజ్‌కోట్‌లో రెండో వన్డే మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ జట్టుకు ఆరో బౌలింగ్ ఎంపిక చాలా అవసరమని తెలిపారు. సుందర్ గాయపడిన పరిస్థితిలో కేవలం ఐదుగురు బౌలర్లతో బరిలోకి దిగడం ప్రమాదకరమని అన్నారు. మొదటి వన్డేలో సుందర్ నాలుగు ఐదు ఓవర్ల తర్వాత గాయపడితే మిగిలిన ఓవర్లు ఎవరు వేస్తారు అనే ప్రశ్న ఎదురవుతుందని వివరించారు. అందుకే ప్రతి జట్టుకు ఆరో బౌలర్ ఉండటం తప్పనిసరి అని చెప్పారు. బదోనీ బ్యాటింగ్‌తో పాటు ఉపయోగకరమైన ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేయగలడని కోటక్ వెల్లడించారు. ఇండియా ఏ జట్టు తరఫున అతడు నిలకడగా రాణించాడని, కొన్ని అర్ధ శతకాలు కూడా సాధించాడని గుర్తు చేశారు. వైట్ బాల్ క్రికెట్‌లో బదోనీ ప్రదర్శన మెరుగ్గా ఉందని, అవసరమైనప్పుడు మూడు నాలుగు ఓవర్లు వేయగల సామర్థ్యం అతనికి ఉందని తెలిపారు. ఈ కారణాల వల్లే సెలెక్టర్లు అతడి వైపు మొగ్గు చూపారని కోటక్ స్పష్టం చేశారు.

## పాక్ సంతతి ఆటగాళ్లకు వీసా నో అన్న వార్తల్లో నిజమెంత




**హైదరాబాద్** ప్రతిష్టాత్మక పొట్టి ప్రపంచకప్ 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనుండగా, టోర్నీకి ముందే మరో వివాదం తెరపైకి వచ్చింది. అమెరికా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న పాక్ సంతతి ఆటగాళ్లకు భారత్ వీసాలు నిరాకరించిందన్న ప్రచారం సోషల్ మాధ్యమాల్లో వేగంగా వ్యాపించి కలకలం రేపింది. ఫిబ్రవరి 7న భారత్‌తో తొలి మ్యాచ్ ఉండటంతో ఈ అంశం మరింత చర్చనీయాంశంగా మారింది. అలీ ఖాన్, జహంగీర్, మహ్మద్ మొహ్సిన్, ఆదిల్ అనే నలుగురు ఆటగాళ్ల వీసాలపై అనుమానాలు తలెత్తాయి. అలీ ఖాన్ తన సోషల్ మాధ్యమంలో చేసిన పోస్టు వల్ల వీసా తిరస్కరణ జరిగిందన్న ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఇది పూర్తిగా నిజం కాదని అధికారులు స్పష్టం చేశారు. వీసాలు తిరస్కరించలేదని, ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా జట్టు కొలంబోలో ఉన్నట్లు సమాచారం. జట్టులోని మిగతా సభ్యుల వీసా ప్రక్రియ అక్కడే పూర్తయ్యింది. అయితే పాక్ సంతతికి చెందిన నలుగురు ఆటగాళ్ల విషయంలో మాత్రం కొంత జాప్యం ఏర్పడింది. వారు భారత రాయబార కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకున్నప్పటికీ, ఈ దశలో వీసా ప్రాసెస్ చేయలేమని సమాచారం అందిందని అధికారులు తెలిపారు. అనంతరం అవసరమైన కొంత సమాచారం మాత్రమే అందిందని, విదేశాంగ శాఖ నుంచి ఇంకా అదనపు వివరాలు రావాల్సి ఉందని తెలియజేశారు. అందువల్ల వీసాలు పూర్తిగా తిరస్కరించారన్న ప్రచారంలో నిజం లేదని స్పష్టత వచ్చింది. ప్రక్రియ పూర్తయ్యే వరకు కొంత సమయం పట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## పాకిస్థాన్‌తో మూడు టి20లు..



**లాహోర్** రాబోయే పొట్టి ప్రపంచకప్‌కు సిద్ధమయ్యే క్రమంలో ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌తో మూడు టి20 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ ఈ నెల 29 నుంచి ప్రారంభం కానుంది. లాహోర్‌లోని గడాఫీ మైదానంలో జనవరి 29, 31 మరియు ఫిబ్రవరి 1 తేదీల్లో ఈ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ప్రపంచకప్‌కు ముందు ఆటగాళ్ల ఫామ్‌ను పరీక్షించుకునేందుకు ఈ సిరీస్ ఎంతో కీలకంగా మారనుంది. ప్రపంచకప్ పోటీలు భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్నాయి. ఆస్ట్రేలియా తన ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్‌లో ఆడనుండగా, పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నింటిని శ్రీలంకలో ఆడనుంది. గతంగా 2022 ఏప్రిల్‌లో ఆస్ట్రేలియా జట్టు చివరిసారిగా పాకిస్థాన్‌లో పర్యటించింది. జనవరి 28న ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌కు చేరుకోనుంది. గత ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా కొన్ని మ్యాచ్‌లు పాకిస్థాన్ వేదికగా జరిగిన సంగతి తెలిసిందే. ఆసీస్‌తో జరిగే ఈ సిరీస్‌కు సంబంధించిన పాకిస్థాన్ జట్టును త్వరలో ప్రకటించనున్నారు. ఈ అంశంపై పాక్ కోచ్ మైక్ హెస్సాన్, కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సిరీస్‌లో ఇరు జట్లు తమ బలాబలాలను పరీక్షించుకొని ప్రపంచకప్‌కు సిద్ధమయ్యే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాయి.

## మరోసారి ర్యాంకింగ్స్ సింహాసనం నంబర్ 1కి దూసుకెళ్లిన కోహ్లీ..!




**ముంబై** భారత స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ మరోసారి తన సత్తా చాటాడు. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకుని ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని మరింత బలపరిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో కోహ్లీకి 785 పాయింట్లు లభించగా అగ్రస్థానంలో నిలిచాడు. ఇటీవల జరిగిన కీలక మ్యాచ్‌ల్లో నిలకడైన ప్రదర్శన కనబరిచిన కోహ్లీ వరుసగా పరుగుల వరద పారించాడు. గత కొద్ది రోజులుగా గిల్, కేన్, ఇతర అగ్ర బ్యాట్స్‌మన్‌లతో తీవ్ర పోటీ ఎదురైనా కోహ్లీ తన అనుభవం, క్లాస్‌తో ముందంజలో నిలిచాడు. ఇప్పటివరకు మొత్తం 28068 పరుగులు చేసి క్రికెట్ చరిత్రలో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 34357 పరుగుల మార్క్‌కు చేరువలో ఉన్నాడు. భారత అభిమానులు ఈ విజయంపై ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మాధ్యమాల్లో కోహ్లీకి అభినందనల వెల్లువ కురుస్తోంది. మరోసారి ప్రపంచానికి తన గొప్పతనాన్ని నిరూపించిన కోహ్లీ భారత క్రికెట్‌కు గర్వకారణంగా నిలిచాడు.

## నేను కారు ఇస్తే నాకు ఫామ్ హౌస్ కావాలి..!



**హైదరాబాద్** మెగాస్టార్ చిరంజీవి కథనాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం సంక్రాంతి కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేస్తోంది. థియేటర్లలో ఫ్యామిలీ ప్రేక్షకులు పెద్ద ఎత్తున ఆదరిస్తుండటంతో చిత్ర బృందం ఆనందోత్సాహాల్లో మునిగిపోయింది. ఈ విజయోత్సవ సభలో దర్శకుడు అనిల్ రావిపూడి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచాయి.వేదికపై మాట్లాడిన అనిల్ రావిపూడి.. సినిమా వసూళ్లు ఒక మిలియన్ దాటితే నిర్మాత తనను కారు ఇవ్వమని అడిగారని, ఆ మాటకు తాను సిద్ధమేనని నవ్వుతూ చెప్పారు. అయితే వసూళ్లు మూడు మిలియన్లు దాటి నాలుగు మిలియన్లకు చేరితే మాత్రం నిర్మాత తనకు ఫామ్ హౌస్ కొనివ్వాలని సరదాగా షరతు పెట్టానని తెలిపారు. ఇప్పుడు నిర్మాత కారు అడుగుతారా లేక ఫామ్ హౌస్ ఇవ్వాలా అనేది వారి ఇష్టమని చెప్పడంతో సభ అంతా నవ్వులతో మార్మోగింది.ఈ సినిమా ప్రయాణం గురించి మాట్లాడిన అనిల్.. తన కెరీర్‌లోనే అత్యంత వేగంగా కేవలం 25 రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేశానని వెల్లడించారు. చిరంజీవి గారిలోని పాతకాలపు హాస్య టైమింగ్‌ను మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో కథను రూపొందించానని చెప్పారు. ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని పేర్కొన్నారు.నిర్మాత సాహు గారపాటి ఎక్కడా రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించారని కొనియాడిన అనిల్.. ఈ విజయంలో వారి పాత్ర చాలా కీలకమని అన్నారు. కామెడీతో పాటు కుటుంబ భావోద్వేగాలను సమతుల్యంగా చూపించడంతో సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని చెప్పారు. ప్రస్తుతం థియేటర్లలో హౌస్ ఫుల్ ప్రదర్శనలతో సినిమా దూసుకుపోతుండటంతో చిత్ర బృందంలో మరింత ఉత్సాహం నెలకొంది.

## నా కొడుక్కి ఆంక్షలే లేవు నిర్ణయం అతనిదే..!!




**హైదరాబాద్** మాస్ మహారాజా రవితేజ తన కుమారుడు మహాధన్ భవిష్యత్తు గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానుల మనసులను తాకుతున్నాయి. తన తాజా చిత్రం ప్రచారంలో భాగంగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రవితేజ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా పిల్లల పెంపకం, స్వేచ్ఛ, నిర్ణయాల విషయంలో తన ఆలోచనలను స్పష్టంగా వెల్లడించారు.తన కుమారుడికి ఇది చేయి, అది చేయకు అని తాను ఎప్పుడూ చెప్పలేదని, ఇకముందు కూడా చెప్పనని రవితేజ స్పష్టం చేశారు. పిల్లలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి, వాళ్ల నిర్ణయాలను గౌరవించాలి అనే నమ్మకం తనదని చెప్పారు. జీవితంలో ఏ దారి ఎంచుకోవాలన్నది పూర్తిగా పిల్లల ఇష్టమేనని, తండ్రిగా తాను మార్గనిర్దేశం చేయగలిగినా ఒత్తిడి మాత్రం తీసుకురానని వెల్లడించారు.ప్రస్తుతం మహాధన్ ప్రతిభావంతుడైన దర్శకుడి వద్ద దర్శకత్వ విభాగంలో శిక్షణ తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రయాణం అతడి స్వంత నిర్ణయమేనని, తన పేరు వల్ల కాకుండా తన ప్రతిభతో ముందుకు సాగాలని కోరుకుంటున్నానని రవితేజ భావోద్వేగంగా తెలిపారు.ఇదిలా ఉండగా రవితేజ నటించిన తాజా చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది. కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కడుతుండగా మాస్ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఒకవైపు సినిమాతో బిజీగా ఉన్నా మరోవైపు తండ్రిగా తన పిల్లలపై చూపిస్తున్న విశాల మనసు ఇప్పుడు సోషల్ మాధ్యమాల్లో ప్రశంసలు అందుకుంటోంది.

## 'అనగనగా ఒక రాజు' ఎలా ఉంది..



**హైదరాబాద్** ఏజెంట్ సాయిశ్రీనివాస్ ఆత్రేయ, జాతిరత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న నవీన్ పొలిశెట్టి నుంచి చాలా గ్యాప్ తర్వాత వచ్చిన సినిమా 'అనగనగా ఒక రాజు'. సంక్రాంతి బరిలో భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రంలో నవీన్ జమీందార్ వంశానికి చెందిన రాజు పాత్రలో కనిపించాడు. గోదావరి జిల్లాల నేపథ్యంతో సాగే ఈ కథలో ఆస్తులన్నీ పోయినా పరువు మాత్రం నిలబెట్టుకుంటూ కోటీశ్వరుడినని ఊరిని నమ్మిస్తూ బతికే యువకుడిగా నవీన్ నటన ఆకట్టుకుంటుంది. అవమానంతో రగిలిపోయి కోటీశ్వరుడి అల్లుడిగా మారాలనే సవాల్‌తో ముందుకెళ్లే రాజు ప్రయాణమే కథకు ఆధారం.పక్క ఊరి జమీందార్ కుమార్తె చారులతగా మీనాక్షి చౌదరి కనిపించింది. ఆమె కూడా తన జీవితంలో నిజాన్ని దాచి బతికే పాత్ర కావడంతో ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ఆసక్తిగా సాగుతాయి. ప్రేమ, పెళ్లి వరకు కథ సరదాగా నడిచినా, పెళ్లి తర్వాత వచ్చే మలుపులు కొంత ఊహించదగ్గవిగా అనిపిస్తాయి. ద్వితీయార్థంలో గ్రామ రాజకీయాలు, సమస్యలు, పరిష్కారాల వైపు కథ మళ్లడం వల్ల కథన వేగం తగ్గిన భావన కలుగుతుంది.నవీన్ పొలిశెట్టి తనదైన చురుకుదనంతో, టైమింగ్‌తో కొన్ని చోట్ల నవ్వించాడు. అయితే అతని గత చిత్రాల స్థాయి హ్యూమర్ మాత్రం పూర్తిగా కనిపించదు. ఎమోషనల్ సన్నివేశాల్లో, యాక్షన్ సీన్స్‌లో మాత్రం నవీన్ కొత్తగా ప్రయత్నించాడు. మీనాక్షి చౌదరి అందంగా కనిపిస్తూ తన పాత్రకు న్యాయం చేసింది. కథను కీలకంగా మలుపుతిప్పే పాత్రలో రావురమేశ్ తనదైన శైలితో బలంగా నిలిచాడుసంగీతం పర్వాలేదనిపిస్తుంది. పాటల్లో కొన్ని మాత్రమే గుర్తుండిపోయేలా ఉన్నాయి. ఛాయాగ్రహణం, నిర్మాణ విలువల్లో నిర్మాతలు రాజీ పడలేదు. అయితే కథ, కథనం విషయంలో ఇంకాస్త బిగువుగా ఉంటే సినిమా స్థాయి మరోలా ఉండేదన్న భావన కలుగుతుంది. మొత్తం మీద 'అనగనగా ఒక రాజు' కామెడీని ఇష్టపడే వారికి ఒకసారి చూడదగ్గ చిత్రంగా నిలుస్తుంది.మొత్తం రేటింగ్ : 2.75/5

## బాక్సాఫీస్ వద్ద చిరు వేట 48 గంటల్లోనే 'ఆచార్య' రికార్డులు క్లోజ్..!!




**హైదరాబాద్** మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన స్టార్ పవర్‌ను రుజువు చేశారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సంక్రాంతి కానుకగా విడుదలైన 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ వసూళ్ల వేట కొనసాగిస్తోంది. విడుదలైన కేవలం 48 గంటల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.120 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సంచలన రికార్డులు నమోదు చేసింది. మొదటి రోజే రూ.84 కోట్ల భారీ వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం రెండో రోజూ అదే జోరుతో దూసుకెళ్లింది. దీంతో చిరంజీవి కెరీర్‌లో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన ఆరో చిత్రంగా నిలిచింది.తెలుగు రాష్ట్రాల్లోనే కాదు విదేశీ మార్కెట్లలో కూడా ఈ సినిమాకు అద్భుత స్పందన లభిస్తోంది. ప్రీమియర్ ప్రదర్శనలతోనే భారీ ఆదాయం సాధించి మెగాస్టార్ క్రేజ్‌ను మరోసారి చాటింది. ముఖ్యంగా చిరంజీవి గత చిత్రం 'ఆచార్య' జీవితకాల వసూళ్లను ఈ సినిమా కేవలం 48 గంటల్లోనే దాటేయడం అభిమానులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తింది.ఈ ఘన విజయానికి ప్రధాన కారణం అనిల్ రావిపూడి చిరంజీవిని వింటేజ్ కామెడీ టైమింగ్‌తో, పాత తరహా ఎనర్జీతో వెండితెరపై ఆవిష్కరించడమేనని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు విక్టరీ వెంకటేష్ చేసిన అతిథి పాత్ర సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. ఇద్దరు అగ్ర నటులు ఒకే తెరపై కనిపించడం అభిమానులకు కన్నుల పండుగగా నిలిచింది. కామెడీ, యాక్షన్, కుటుంబ భావోద్వేగాలు సమతుల్యంగా ఉండటంతో కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు భారీగా తరలివస్తున్నారు.టికెట్ల విక్రయాలు ప్రతి గంటకు వేల సంఖ్యలో కొనసాగుతుండటం సినిమాపై ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపిస్తోంది. ఈ అద్భుత స్పందన పట్ల చిరంజీవి ఆనందం వ్యక్తం చేస్తూ, తనకు ఇది మరపురాని సంక్రాంతి కానుక అని పేర్కొన్నారు. నిర్మాత సాహు గారపాటి, దర్శకుడు అనిల్ రావిపూడి కూడా ఈ విజయాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ చూస్తుంటే రాబోయే రోజుల్లో ఈ సినిమా మరిన్ని రికార్డులు తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com